ప్రమాదాలకు కేరాఫ్ మంథని రహదారి

- గుండారం శివారులో నిత్యం ప్రమాదాలు
- ప్రమాదాల్లో పలువురి మృతి

కమాన్‌పూర్: మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారి గుండారం శివారు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారింది. నిత్యం ఇక్కడ ఏదో ఒక ప్రమాదం చోటు చేసుకుంటోంది. ప్రమాదాల్లో పలువురు మృతి చెందగా, చాలామంది తీవ్ర గాయాలతో బయటపడ్డారు. వాహనాల మితిమీరిన వేగంతో వస్తుండడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. కమాన్‌పూర్ మండలం గుండారం రాజేంద్రనగర్ శివారు నుంచి కమాన్‌పూర్ ఎక్స్‌రోడ్డు బాపూజీ నగర్ వరకు మంథని –పెద్దపల్లి ప్రధాన రహదారిపై ప్రయాణించాలంటే వాహనదారులు జంకుతున్నారు. ఇటీవల రహదారి మరమ్మతుల నేపథ్యంలో వాహనాలు మితిమీరిన వేగంతో పోతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

పలువురు మృతి

మంథని–పెద్దపలి ప్రధాన రహదారి పై ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గుండారం గ్రామానికి చెందిన తూర్పాటి సమ్మయ్య ఎక్స్‌ఎల్ వాహనం తన కూతురును తీసుకొని ఇంటికి వస్తున్న క్రమంలో సమ్మయ్య రోడ్డు దాటుతున్న క్రమంలో వెనుక నుంచి స్కూటి పై వచ్చిన వ్యక్తి ఢీ కొట్టడంతో సమ్మయ్యకు తీవ్ర గాయాలై మృతి చెందాడు.



ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సమ్మయ్య(ఫైల్)

– రాజేంద్ర నగర్ సమీపంలో ముత్తారం మండలం లక్కారం గ్రామానికి చెందిన సదయ్య పెద్దపల్లి వైపు నుంచి వస్తున్న బైక్ ఢీ కొట్టడంతో సదయ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.



మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారి

– కమాన్‌పూర్ ఎక్స్ రోడ్డు వద్ద గల వైన్స్ షాపులో పని చేసే అజయ్ రాత్రి ఇంటికి వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అజయ్ మృతి చెందాడు. ఇవేగాక ఈ రహదారిపై జరిగిన అనేక ప్రమాదాల్లో పలువురు గాయపడిన సందర్భాలు ఉన్నాయి. రహదారి మరమ్మతుల నేపథ్యంలో దారిపై వెళ్లే వాహనాల స్పీడ్‌కు అడ్డు అదుపూ లేకుండా పోయింది. టూ వీలర్ వాహనాలు, ఇసుక లారీలు సైతం అతి వేగంతో వెళ్తుండంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో మంథని– పెద్దపల్లి రహదారిపై ప్రయాణించాలంటే వాహనదారులు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారిపై జరుగుతున్న ప్రమాదాలను నివారించడానికి తగు చర్యలు తీసుకుంటున్నాం, ఇప్పటికే డేంజర్ జోన్‌లను గుర్తించాం, కొద్ది రోజుల్లో రహదారి పై స్టాప్పర్లను ఏర్పాటు చేస్తాం. ప్రమాదాల నివారణపై వాహనదారులకు. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– షేక్ మస్తాన్,ఎస్సై,కమాన్‌పూర్

కళాశాలలో ఉచిత భోజనం ప్రారంభం

కమాన్‌పూర్: మండలంలోని గుండారం ప్రభుత్వ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మధ్యాహ్న భోజనాని గురువారం ఎంపీపీ రాసకొండ లక్ష్మి ప్రారంభించారు. సిద్దిపల్లె సర్పంచ్ తాటికొండ విద్యార్థులు స్టీల్ ప్లేట్లను అందజేశారు. విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉండాలని కోరారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, సర్పంచ్‌లు తాటికొండ శంకర్, నీలం సరిత, ఎంపీటీసీ బోనాల వెంకటస్వామి, కళాశాల ప్రిన్సిపాల్ సునంద, నాయకులు పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరం ప్రారంభం

మంథని: మున్సిపల్ పరిధిలోని ఐదో వార్డు కూచిరాజుపల్లిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని గురువారం మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ ప్రారంభించారు. ఈ సందర్భంగా పుట్ట శైలజ మాట్లాడుతూ ప్రజలందరు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నక్క నాగేంద్ర శంకర్, కుర్ర లింగయ్య, బుద్దార్థి రాణి, కమిషనర్ శారద, వైద్యులు శంకరమ్మ, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

జూలపల్లి: కొండగట్టు దేవాలయ అభివృద్ధికి సీఎం కేసీఆర్ భారీగా నిధులు కేటాయించడం చారిత్రాత్మక నిర్ణయమని కేసీఆర్ సేవాదళం జిల్లా అధ్యక్షుడు దండె వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో గురువారం కేసీఆర్ సేవాదళం ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శాతల్ల కాంతయ్య, యూత్ ప్రధాన కార్యదర్శి సాయినాథ్,మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు సతీష్,కనుకయ్య, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

గోదావరినది వద్ద పారిశుధ్య పనులు



పనులను పరిశీలిస్తున్న సర్పంచులు

రామగుండం: ఈనెల 18వ తేదీన జరిగే మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకుని అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ గోదావరి నదికి వేలాది మంది పుణ్యస్నానాలకు తరలివస్తుంటారు. ఈ నేపథ్యంలో గురువారం భక్తులకు మెరుగైన సౌకర్యాలతో పాటు గోదావరి నది ఒడ్డున ఉన్న చెత్తాచెదారంతో పాటు ఘాట్‌పై పేరుకుపోయిన బురద మట్టిని తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు. గోలివాడ, విలేజీ అంతర్గాం గ్రామ పంచాయతీ కార్మికులు పారిశుధ్య పనులు చేపట్టగా, ఆయా గ్రామాల సర్పంచులు ధర్ని రాజేశ్, సతీశ్, పంచాయతీ కార్యదర్శులు పనులు పర్యవేక్షించారు.

మంథనిలో 'ప్రజాగోస బీజేపీ భరోసా'



మాట్లాడుతున్న రామనాథ్

మంథని: నియోజకవర్గంలోని బీజేపీ రాష్ట్ర నాయకుడు చందుపట్ల సునీల్‌రెడ్డి చేపట్టిన మంథని ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమానికి ప్రజలు నీరాజనాలు పలికారని బీజేపీ పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రామనాథ్ అన్నారు. మంథనిలో గురువారం ఆయన మాట్లాడారు. నియోజవర్గానికి ప్రాతినిధ్యం వహించిన శ్రీధర్‌బాబు, పుట్ట మధులు ప్రజలను అన్ని విధాలుగా మోసం చేశారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో మంథని నియోజకర్గాన్ని నీట ముంచిన ఎటువంటి నష్ట పరిహారం అందించకుండా రైతులను మోసం చేశారని అన్నారు. మంథని నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేసే వరకు పోరాడుతామన్నారు. సమావేశంలో నాయకులు ఎడ్ల సదాశివ్, మల్లికార్జున్, మహావాది రామన్న, రాజేశం, సంతోష్, మధుకర్ పాల్గొన్నారు.

చివరి భూములకు నీరందించండి

ఓదెల: ఆయకట్టు చివరి భూములకు సాగు నీరందించాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఓదెల దేవస్థానంలో జరిగిన ఉత్సవాల్లో పాల్గొనటానికి వచ్చిన ఎమ్మెల్యేకు రైతులు పడాల సతీష్, మూడెత్తుల సంపత్, శీలం ప్రభాకర్ రెడ్డి, మూడెత్తుల సదయ్య, రాపర్తి వేణు, పందిసది, రేండ్ల నరేశ్, చందు, రాపర్తి మల్లయ్య, మొగిలి నీరందక చేన్లు ఎండిపోతున్నాయని తెలిపారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఎస్సారెస్పీ ఎస్ఈఈ, డీఈఈకి ఫోన్ చేసి కాల్వశ్రీరాంపూర్ మండలం చివరిభూముల పంటలకు నీరందాలని ఆదేశించారు.

పోలీస్ హౌసింగ్ చైర్మన్‌ను కలిసిన సీపీ



గోదావరిఖని: పోలీస్‌హౌజింగ్ బోర్డు చైర్మెన్ కోలేటి దామోదర్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి గురువారం గోదావరిఖనిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోలేటి దామోదర్ కుటుంబ సభ్యులు సీపీకి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆర్‌బీఐ ఏజీఎం అనిల్ కుమార్

సుల్తానాబాద్: ఆన్‌లైన్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్‌బీఐ ఏజీఎం అనిల్‌కుమార్ అన్నారు. సుల్తానాబాద్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆవరణలో గురువారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదుస్సు నిర్వహించారు. కమర్షియల్, రైతులకు పంట, స్వశక్తి మహిళలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకు సిద్ధంగా ఉందని, వాటిని సకాలంలో చెల్లించడం వల్ల మరొకరికి అవకాశం కలుగుతుందని వివరించారు. సమాజంలో మోసాల సంఖ్య పెరుగుతోందని, బ్యాంకులో లావాదేవీలను చూసి ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారని, వినియోగదారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఖాతా నుంచి డబ్బులు పోతే తక్షణమే బ్యాంక్ అధికారులను సంప్రదించాలన్నారు. డిపాజిట్లపై ఆదాయం, సేవింగ్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్, నెలవారి పొదుపుపై వివరించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆర్ఎం సీహెచ్. లక్ష్మణ్‌రావు, ఎల్డీఎం వెంకటేశ్, సుల్తానాబాద్ మేనేజర్ జి.శేఖర్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏజీఎం అనిల్ కుమార్

పేదల సంక్షేమమే లక్ష్యంగా కేసీఆర్ ముందుకు

గోదావరిఖని: పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని కోలేటి దామోదర్ తెలి పారు. కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని కోలేటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామగుండం నియోజకవర్గంలో మహిళలకు 25వేల చీరెలు, మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పాలన సాగిస్తున్న కేసీఆర్.. దేశవ్యాప్తంగా రాజకీయాల్లో ప్రధాన భూమిక పోషించాలని ఆకాంక్షించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణాలో అన్నివర్గాలకూ సంక్షేమ పథకాలు ప్రారంభించిన గొప్ప నేత కేసీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో కోలేటి ఫౌండేషన్ బాధ్యులు కోలేటి శ్రీనివాస్, పల్లె రమేశ్, బొబ్బిలి సతీశ్, సుధీర్‌గౌడ్, నరేశ్, చందు, సాయి, రాజయ్య, రాయలింగు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జన్మదిన వేడుకలు



చీరెలు పంపిణీ చేస్తున్న కోలేటి దామోదర్

రామగుండం: సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి గురువారం తన స్వగ్రామం లింగాపూర్‌లోని ఇంటి వద్ద వినూత్నంగా నిర్వహించారు. ఇంటి ఆవరణలో దేశ్‌కీ నేత కేసీఆర్ పేరుతో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల పోస్టర్లను ప్రదర్శిస్తూ, వందలాది గులాబీ బెలూన్లను గాలిలోకి వదిలిపెట్టారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

26 వరకు 'డబుల్' లబ్ధిదారుల ఎంపిక జరగాలి

- కలెక్టర్లతో సీఎస్ శాంతికుమారి
- హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్

పెద్దపల్లిరూరల్: డబుల్ బెడ్‌రూం ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి ఈనెల 26వరకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు, కంటివెలుగు, పోడు భూములు, హరితహారం కార్యక్రమాలపై సమీక్షించారు. పట్టణ ప్రాంతాల్లో 42వేలకు పైగా ఇళ్లను లబ్ధిదారులకు అందించాల్సి ఉండగా.. ఇప్పటివరకు 6,620 మాత్రమే పంపిణీ చేశారని, మిగతా వాటికోసం లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేయాలని ఆదేశించారు. కంటివెలుగు శిబిరాల నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని, ఎండతీవ్రత పెరుగుతోందని, చల్లని మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రిస్క్రిప్షన్ అద్దాల పంపిణీ మొదలైందని, లబ్ధిదారులకు అందించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. పోడుభూముల పట్టాల పంపిణీ ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే ఏడాది హరితహారానికి అవసరమైన మొక్కలను పెంచేందుకు నర్సరీలు సిద్ధం చేయాలన్నారు.



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ అధికారులు

ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాలివ్వండి: కలెక్టర్ సంగీత

కంటివెలుగులో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు ఎప్పటికపుడు అందించాలని కలెక్టర్ సంగీత సంబంధిత అధికారులను ఆదేశించారు. కంటిపరీక్షలు చేయించుకుని ప్రిస్క్రిప్షన్ ద్వారా వచ్చిన అద్దాలను ఏఎన్ఎంల వారీగా విభజించి శనివారం వరకు పంపిణీ చేయాలన్నారు. డీఎఫ్ఓ శివయ్య, డీఎంహెచ్ఓ ప్రమోద్‌కుమార్, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్, డీఆర్‌డీఓ శ్రీధర్ తదితరులున్నారు.

మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి

పెద్దపల్లిరూరల్: పంచాయతీ కార్మికులకు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 20న తలపెట్టిన పాదయాత్రను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం కరపత్రాలు ఆవిష్కరించారు. కేంద్రప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నాలుగు కోడ్‌లను రద్దుపర్చాలని, ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్సు హక్కులు కల్పించాలని పేర్కొన్నారు. నాయకులు ఖాజా, మల్లేశ్, శ్రీకాంత్, తిరుపతి, సందీప్ తదితరులున్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ: ఎస్‌హెచ్‌జీ స్వశక్తి సంఘాలకు బ్యాంకులు ఇచ్చే రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని రామగిరి మండలం ముస్త్యాల సర్పంచ్ లావణ్య కేడీసీసీ బ్యాంకు మేనేజర్ రామకృష్ణ సూచించారు. గురువారం గ్రామంలో సెంటినరీ కాలనీ కేడీసీసీ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రుణ మేళాకు హాజరై మాట్లాడారు. మహిళా సంఘాలకు రూ. 35 లక్షల రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు.మహిళలు సకాలంలో రుణాలు చెల్లిస్తే రుణాలకు తక్కువ వడ్డీ పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సాగర్, వీవో సౌజన్య, ఏపీఎం స్వరూపరాణి, సీసీ బాపు, స్వశక్తి సంఘాల మహిళలు పాల్గొన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

పెద్దపల్లిరూరల్: క్రీడలు స్నేహసంబంధాలను పెంపొందిస్తాయని ట్రాఫిక్ సీఐ అనిల్ అన్నారు. పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో కేసీఆర్ కప్ క్రికెట్ పోటీలను గురువారం ప్రారంభించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. మండలంలోని పలు గ్రామాల జట్ల నడుమ పోటీలు హోరాహోరిగా సాగాయి. పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీనాయకులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు వృత్తి పన్ను రద్దుచేయాలి

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల నుంచి వసూలు చేసే వృత్తి పన్ను వెంటనే రద్దు చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు డిమాండ్ చేశారు. ఒక్కో సింగరేణి కాంట్రాక్టు కార్మికుని నుండి నెలకు రూ.150 చొప్పున వసూలు చేయడం దుర్మార్గం అన్నారు. పర్మినెంట్ కార్మికులకు లేని వృత్తి పన్ను కాంట్రాక్టు కార్మికులకు ఎందుకని ప్రశ్నించారు.

చికిత్సకు వచ్చే రోగులకు ఉచిత బస్సు సౌకర్యం

జూలపల్లి: నగునూర్‌లోని ప్రతిమ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలోని ప్రతిమ ఫౌండేషన్, మండలం కేంద్రంతో పాటు వడ్కాపూర్,కాచాపూర్,పెద్దాపూర్ గ్రామాలలోని నిరుపేద రోగులు చికిత్స కోసం ప్రతి శుక్రవారం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు ప్రతిమ ఫౌండేషన్ ఆర్గనైజర్ గుంటి శంకర్ తెలిపారు. మండలంలోని ప్రజలు ప్రతిమ ఫౌండేషన్ కల్పించిన బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆర్థికసాయం

జూలపల్లి: మండల కేంద్రానికి చెందిన గంగిపెల్లి ఎల్లయ్య కుమారుడు శంకరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ గురువారం పరామర్శించి రూ. 5 వేలు, 50 కేజీల బియ్యం అందజేశారు. ఆయన వెంట నాయకులు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మహ్మద్ అంకూస్, తాజోద్దీన్, సల్మాన్, మేర శ్రీనివాస్, కొమురయ్య, సతీశ్, రజక సంఘం నాయకులు ఉన్నారు.

బ్లాక్ కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా రాజు



నియామక పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

మంథని: బ్లాక్ కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా మంథని మండలంలోని గుమ్మనూరు గ్రామానికి చెందిన వేల్పుల రాజు నియమించినట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతియాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నియామక పత్రం అందజేశారు.

మాల సంఘం అధ్యక్షునిగా బోగం ఎల్లయ్య



ఎల్లయ్యను అభినందిస్తున్న నాయకులు

రామగిరి: ముత్తారం మండంలోని కేశనపెల్లి గ్రామ మాల సంఘం అధ్యక్షుడిగా బోగం ఎల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం గ్రామంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని ఎల్లయ్య అన్నారు. కార్యక్రమంలో బోగం నారాయణ, బందెల మొండయ్య, కోడం రాయమల్లు, పత్తెం వెంకటస్వామి, అర్జున్, లక్ష్మి, శారద పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ నాగవెల్లి పట్నం

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో శ్రీరేణుకా ఎల్లమ్మ పట్నాల ఉత్సవాల్లో భాగంగా గురువారం ఎల్లమ్మతల్లి నాగవెల్లి పట్నంను అత్యంత వైభవంగా నిర్వహించారు. నాగవెల్లి పట్నంపై ఎల్లమ్మతల్లి విగ్రహాన్ని ఉంచి, బోనాలను ఉంచి మొక్కులు చెల్లించుకున్నారు. బైండ్లపూజారులు ఎల్లమ్మ కథను భక్తులకు వినిపించారు. గౌడసంఘం నాయకులు దాదాపు 20 మంది మోకు, ముత్తాదుతో తాటి చెట్టును ఎక్కి చేతుల మీదుగా తాటికల్లును తీసుకవచ్చి అమ్మ వారికి నైవేద్యంగా సమర్పించారు. ఉత్సవాలు గురువారంతో ముగిశాయి.



దేశానికే ఆదర్శం తెలంగాణ పల్లెలు

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

జూలపల్లి: అభివృద్ధిలో తెలంగాణ పల్లెలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పెద్దాపూర్‌లో రూ. 5 లక్షల నిధులతో పోచమ్మ గుడి నుంచి ఆర్అండ్‌బీ రోడ్డు వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తోందన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని,ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.కార్యక్రమంలో సర్పంచ్ కంకణాల భారతి, ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి, ఉపసర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం సీఎం కేసీఆర్ పాలన

కాల్వశ్రీరాంపూర్:సీఎం కేసీఆర్ సంక్షేమ పాలన, అభివృద్ధి పథకాలతో దేశానికే ఆదర్శంగా నిలిచారని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. గురువారం కాల్వశ్రీరాంపూర్ సీఎం కేసీఆర్ పుట్టిన రోజు కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. సీఎం జన్మదినం సందర్భంగా నిర్వహించిన ఈటోర్నమెంట్‌లో విన్నర్‌గా నిలిచిన వెన్నంపల్లి జట్టుకు రూ. 10.116, షీల్డ్, ద్వితీయ స్థానంలో నిలిచిన కూనారం జట్టుకు రూ.5,016 , షీల్డ్‌ను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడ్డు రాజకొమురయ్య యాదవ్, సొసైటీ చెర్మన్లు రాంచంద్రా రెడ్డి, పురుషోత్తం, వైస్ ఎంపీపీ శిరీష, సర్పంచులు, ఎంపీటీసీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ఆర్‌ఎఫ్‌సీఎల్ బాధితుల తరఫున ఉద్యమిస్తాం

రామగుండం: ఉద్యోగాల పేరిట మోసపోయిన ఆర్‌ఎఫ్‌సీఎల్ బాధితుల పక్షాన కలిసివచ్చే విప్లవ పార్టీలతో కలిసి ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నామని, సీపీఎం, సీపీఐ అధికార పార్టీతో అంటకాగుతున్నాయని ప్రజాపంథా జిల్లా కన్వీనర్ గుజ్జుల సత్యనారాయణరెడ్డి తెలిపారు. గురువారం అంతర్గాం ప్రెస్‌భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 22న సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆవిర్భావ వేడుక సందర్భంగా గ్రామాల్లో అరుణ పతాకావిష్కరణ చేస్తామన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, అర్హులకు ఆంక్షలు లేకుండా డబుల్‌బెడ్ రూం ఇళ్లు కేటాయించాలన్నారు. ఒకే దఫాలో రుణమాఫీ చేయాలని, గోదావరిపై వంతెన పనులు వేగం పెంచాలని, పత్తి క్వింటాల్‌కు రూ.15వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు జూపాక శ్రీనివాస్, తోకల రమేశ్, గుమ్మడి వెంకన్న, ఆడెపు శంకర్, పెండ్యాల రమేశ్, కట్ట తేజేశ్వర్, భూషణవేణి కృష్ణ, నస్పూరి లక్ష్మి, గొల్లపల్లి చంద్రయ్య, ఆలకుంట ఎల్లయ్య ఉన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

ముగిసిన ఆలయ వార్షికోత్సవాలు

రామగుండం: శ్రీషిర్డీసాయిబాబా ఆలయ 27వ (సప్తవింశతి) వార్షికోత్సవ వేడుకలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ గట్టు నరహరి శర్మవధాని నేతృత్వంలో వేద బ్రాహ్మణ పండితుల బృందంతో లోక కళ్యాణార్థం నక్షత్రేష్టి, నవగ్రహ, చండీయాగం వేడుకలను వైభవంగా నిర్వహించారు. 108 మంది పుణ్య దంపతులు చండీయాగంలో పాల్గొని తమ భక్తి శ్రద్ధలను చాటుకున్నారు. వేడుకలలో భాగంగా బ్రహ్మశ్రీ గట్టు నరహరిశర్మను మాజీ మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ శాలువ, పండ్లు అందజేసి ఆశీర్వచనాలు స్వీకరించారు. వేడుకలకు మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ కన్నూరి సతీష్‌కుమార్, కార్పొరేటర్లు బాలరాజ్‌కుమార్, కృష్ణవేణి, కవిత, సరోజిని, అడ్డాల స్వరూప, గంగా శ్రీనివాస్, కాల్వశ్రీనివాస్, పొన్నం లక్ష్మణ్‌గౌడ్, గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.



చండీయాగంలో పాల్గొన్న 108 జంటలు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

జూలపల్లి: మండలంలోని తేలుకుంటలో శ్రీ సీతారామ,లక్ష్మణ,ఆంజనేయ సహిత మహాగణపతి కుమారస్వామి ధ్వజస్తంభ,శిఖర యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపనలో మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయ రమణరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని యాదవ సంఘం ఆధ్వర్యంలో వేస్తున్న శ్రీ నాగుల మల్లికార్జున స్వామి పట్నాల్లో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఆయన వెంట నాయకులు కందుకూరి అంజయ్య, శ్యాం,స్వామి,ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

మూడు రోజులు మార్కెట్ బంద్

పెద్దపల్లి రూరల్: మహాశివరాత్రి పురస్కరించుకుని శని, ఆది, సోమవారాల్లో మార్కెట్ మూసి ఉంటుందని, తిరిగి మంగళవారం నుంచి యథావిధిగా కొనుగోళ్లు సాగుతాయని మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు. రైతులు గమనించి సహకరించాలని కోరారు.